కానీ సీతాపురం అన్న పేరు, రాంబాబు అన్న పేరు వారు నాకు గుర్తు చేయటం, మా స్వగ్రామం సీతాపురం అవ్వటం, మా తాతగారు తన పితామహులు ఇచ్చిన వంద ఎకరాల పంట పొలాలను, స్వాతంత్ర్యోద్యమం కోసం ఖర్చు చేయటం, దాదాపు ఈ భూములన్నీ రాంబాబుగారే స్వాహా చెయ్యటం నాకు లీలగా గుర్తుకొచ్చాయి. ఈ రాంబాబుగారు సారా వ్యాపారాన్ని చేసి చాలా సార్లు జైలుకు వెళ్ళారు. అతను, అతని వారసులు అదే వ్యాపారాన్ని చేసి ఆస్తులను విపరీతంగా పెంచటం, పెరిగిన ఆస్తులను కాపాడుకోవటం కోసం రాజకీయ రంగప్రవేశం, తను జైలుకు వెళ్ళటాన్ని మరోకోణంలో ప్రచారం చేసుకోవటం, ఇప్పటి రాజకీయాల్లో పాత్రుడు రాంబాబు మరింత సంపాదించుకోవటం,



ఇటువంటి వ్యక్తులతో నిండిపోతున్న చట్టసభలూ, వీరు చట్టాలు చెయ్యటం-ఓహ్

మా తాతగారు శూన్యహస్తంతో నాన్నగార్ని ఆశీర్వదించి కన్నుమూసారు. మిగిలిందేమీ లేదని తెలుసుకొని నాన్నగారు మమ్మల్ని పట్నం పట్టుకు వచ్చి, నాలుగు వైదీకపు ముక్కల్తో సంసారాన్ని లాగుతూ మా యిలవేల్పయిన చదువులతల్లి సరస్వతిని ప్రార్థించారు. దాంతో ఈ టీచరుద్యోగం నాకు దక్కింది.

ఇదంతా జ్ఞాపకం వచ్చి మనసు పాడైపోయింది. నా భార్యాపిల్లలు వెళుతున్న పటాటోపం వేపు చూస్తున్నారు. నిశ్శబ్దంగా నేనింట్లోకి వచ్చి చిత్రకారుడు వేసిన తాతగారి ఫోటోను చూస్తూ

''మీరు సమర్పించిన వందెకరాల భూమి, త్యాగం కనీసం మిమ్మల్ని స్వాతంత్ర్య సమరయోధులుగా గుర్తించలేకపోయాయి. మీ కథ, మీలాటి త్యాగమూర్తుల కథలూ మరుగున పడితే దేశానికొచ్చిన నష్టం ఏమీ లేదు. కానీ ఈ నూడో స్వాతంత్ర్యసమర యోధులు, వారి వారసులు చట్టసభలకు పోతున్నారు'' అన్నాను తాతగారితో.

'అందుకేగా...పెద్దలంతా పైకి వచ్చేశారు! నువ్వు రాజకీయాల గురించి ఆలోచించకు..నీ బుర్రపాడయిపోతుంది..' అన్నట్టుగా కనిపించింది ఫోటోలో తాతగారి ముఖం!

**-బి.వి.కొండలరావు,**

49-36-21, అక్కయ్యపాలెం,

విశాఖపట్నం-16

# ఆదర్శాలు

పురుషోత్తమరావు గొప్ప ఆదర్శపురుషుడు. అతని ఆదర్శాల వల్లే ఒక విధంగా అటు బంధువులకూ యిటు స్నేహితులకూ దూరమయ్యేడు.

పురుషోత్తమరావుకు పిత్రార్జితం పుష్కలంగా వుంది. స్ట్రిక్ట్ ఆఫీసర్‌గా పేరుంది.

అతను ఆఫీసరుగా ఛార్జి తీసుకున్న రోజే స్టాఫ్ అందర్నీ సమావేశపరచి ''ఆఫీసులో అందరూ డిసిప్లేన్ పాటించాలని వర్క్ టైమ్ ప్రకారం పూర్తవ్వాలని, టైమింగ్స్ రిజిడ్‌గా ఫాలో అవ్వాలని, పార్టీలను ఎవరూ ఎక్కువసేపు ఎంటర్‌టైన్ చెయ్యక వారి పని సత్వరం ముగించి పంపాలని'' రూల్స్ పాస్ చేసేడు. అంతేకాదు- ఏ రూపంలోనూ లంచం పుచ్చుకోరాదని, అలా పుచ్చుకున్నవారిపైనా, యిచ్చినవారిపైనా కఠినంగా చర్య తీసుకుంటా''నని చెప్పేడు.

ఒకరోజు ఉదయం పదకొండు గంటల సమయంలో పురుషోత్తమరావు ఆఫీస్ వర్క్ చూసుకుంటున్న సమయంలో ప్యూన్ వచ్చి-

''సార్! ఎవరో ఆవిడ వచ్చేరు. తవర్ని వెంటనే చూడాలంటున్నారు'' అన్నాడు.

వచ్చిన ఆమె వయస్సు సుమారు మూడు పదులలోపే వుంటుంది. చామనచాయ రంగు మనిషి పుష్టిగా వుంది. ముఖంలో మంచి కళ వుంది.

''దండాలండి! యిది తవదే కదండీ!'' అంటూ జాకెట్‌లో చెయ్యి పెట్టి చిన్న కార్డ్ తీసి పురుషోత్తమరావుకిచ్చింది.

''ఓ మైగాడ్! ఎక్కడ దొరికిందమ్మాయిది నీకు!'' అన్నాడు ఆశ్చర్యంతో.

అది పురుషోత్తమరావు 'బేంక్ క్రెడిట్ కార్డ్'.

''పిట్రోలు బంకి కాడండి! తవ జేబీలోంచి నేల మీద పడిపోనాదండి! తవరు కానుకోనేదు కారెక్కి ఎల్లిపోనారు..''

''థాంక్స్! ఇది ఎంతో విలువైంది! పాపం ఎండలో శ్రమపడి చాలాదూరం నుండి తెచ్చి యిచ్చేవు!'' అని పర్స్‌లోంచి ఇరవై రూపాయల నోటు తీసి ఆమెచేతిలో వుంచి 'టీ త్రాగు' అన్నాడు కృతజ్ఞతతో.

''ఏటి బాబూ! తవరు నాకు నంచం ఎడతన్నారా?'' అంది పౌరుషంగా.

ఆమె కామెంట్‌కు పురుషోత్తమరావు షాక్ అయ్యేడు.

''అబ్బే యిది లంచం కాదమ్మా! యిది నేను నీకు....'' అంటూ ఏమో చెప్పబోయేడు.

''ఏటేటి? నంచం గాదా! మరి..ఓలమ్మ..ఓలమ్మ నాను అట్టాంటిదాన్ని అనుకున్నావేటి?'' అంటూ విసురుగా బయటకు వచ్చి ''సూడండి భావులూ! ఆపీసరాయన సేతిలో నోటు ఎట్టి ఏటేటో అంతన్నాడు!'' అంది బిగ్గరగా.

ఆమె కేకలకి ఆఫీసు స్టాఫ్, అదే ఫ్లోర్‌లో వున్న యితర ఆఫీసుల్లోవారూ ఆమె చుట్టూ మూగేరు.

''ఏమయ్యా! ఎన్నో ఆదర్శాలు వల్లిస్తావ్! ఎంతో నీతిమంతుడని విర్రవీగుతావు! యిదేం పనయ్యా నీకు! చెప్పేవి శ్రీరంగనీతులు..'' అని నిలదీసారు.

పురుషోత్తమరావుకి నలుగురిలో తలవంపులైంది.

''స్టుపిట్! నాన్సెన్స్! నిజా నిజాలు తెల్సుకోక ఏమిటి మీరు అంటున్నది! నా బేంక్ క్రెడిట్ కార్డ్ రోడ్డు మీద పడిపోతే యీవిడకు దొరికిందని తెచ్చి యిచ్చింది. ఆమె చేసిన సహాయానికి కృతజ్ఞతతో...''

''నా సేతిల నంచం ఎట్టేనంతావ్!'' అంది ఎగతాళిగా.

''ఛా! దాన్ని లంచం అనకూడదమ్మా! బహుమానం, బక్షీస్ అనాలి!'' అన్నారు గుంపులో ఒకాయన వ్యంగ్యంగా.

''అవును! కరెక్ట్‌గా చెప్పేరు! యీవిడ ఎండలో ఎంతో శ్రమపడి నన్ను వెతుక్కుంటూ వచ్చి నేను పోగొట్టుకున్న వస్తువు తెచ్చి నాకు యిచ్చినందుకు బహుమానం!'' అన్నాడు.

''ఏటేటీ? పెద్దోల్ల సేతిల యిచ్చేది బగుమానం! బచ్చీసా మరి వుచ్చుకున్న కూలోడి సేతిల అది నంచవా! ఆరికో నీతి మాకో నీతా! ఇనండి భావులూ నాయం!'' అంది ఆవేశంగా.

''అలా అని ఎవరనగలరు? నేను సంతోషంతో యిచ్చింది లంచం ఎట్లాగవుతుంది బహుమానం గాక!''

''అట్టాగేం? మరి నా పెనివిటి ఆదిమూర్తి ఏ నేరం సేసేడని ఉజ్జోగంల నెల దినాలు సస్పెండు సేసేసినావు? ఆ పెద్దాయన ఎవుడో సంతోషంతో ''ఛాయి దాగమని'' పది రూపాయల నోటు సేతిలో ఎట్టి ఎల్లిపోనాడు. అత్తెరి ఆడి కాడ నువ్వు నంచం వుచ్చుకున్నావు! యీ పొద్దు నాకంటపడింది! నాను సూడకుండా ఎందరికాడ నంచాలు వుచ్చుకుంతున్నావో! అని నెలదినాలు సస్పెండు సేసి నారుగందా! మరది నంచవైతే యిదేటీ?'' అంది ఉక్రోషంగా.

నిజమే! వారం రోజుల క్రితం ఆదిమూర్తికి ఒక కస్టమర్ పది రూపాయల నోటు యివ్వటం పురుషోత్తమరావు కంటపడింది. ఆదిమూర్తిలంచం తీసుకున్నాడన్న నేరంపై అతడిని నెల రోజులు సస్పెండ్ చేసేడు. అతడి తప్పు లేదని ఎందరు ఎన్ని విధాలుగా చెప్పినా పురుషోత్తమరావు వినలేదు.

''అంటే నువ్వు ఆదిమూర్తి భార్యవా?!'' అన్నాడు పురుషోత్తమరావు తడారిన గొంతుకతో.

**-రావి-ఎస్-అవధాని,**

25-12-6/1, ఎల్.కె.గార్డెన్స్, దాసన్నపేట,

విజయనగరం-535002.